ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 26-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజ్యాంగం ద్వారా ప్రజల సమిష్టి, వ్యక్తిగత గౌరవం రెండింటినీ పరిరక్షించాలని రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ దేశీయ విమానయాన మార్కెట్ ప్రపంచ వ్యాప్తంగా మూడవ అతి పెద్ద వ్యవస్థగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ పాడి పరిశ్రమ దేశానికి మూలస్తంభమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

==================

రాజ్యాంగం ద్వారా ప్రజల సమిష్టి, వ్యక్తిగత గౌరవం రెండింటినీ పరిరక్షించాలని రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని తీసుకుని దేశంలోని అనేక వర్గాల ప్రజానీకం భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌లోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి అధ్యక్షతన 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభను ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీ పీ రాధాక్రిష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... భారత పార్లమెంట్ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలకు ఉదాహరణగా నిలుస్తోందన్నారు. రాజ్యాంగం జాతీయ గుర్తింపుకు మూలస్తంభమని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

==================

దేశీయ విమానయాన మార్కెట్ ప్రపంచ వ్యాప్తంగా మూడవ అతి పెద్ద వ్యవస్థగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్

సర్వీసెస్ ఇండియా (SAESI) సౌకర్యాన్ని ప్రధానమంత్రి ఢిల్లీ నుంచి దృశ్యమాధ్యమం ద్వారా ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సఫ్రాన్ సౌకర్యం భారతదేశాన్ని ప్రపంచ మేంటేనెన్స్ రిపేర్స్ & ఆపరేషన్స్ (MRO) హబ్‌గా మార్చేందుకు దోహదపడుతుందని చెప్పారు. భారతదేశ విమానయాన రంగం వేగంగా విస్తరించడంతో MRO సౌకర్యాల అవసరం కూడా పెరిగిందని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ సౌకర్యం వల్ల యువతకు హైటెక్ ఏరోస్పేస్ రంగంలో కొత్త అవకాశాలు లభిస్తాయన్నారు. దేశంలో విమాన ప్రయాణానికి ప్రాధాన్యత పెరుగుతూనే ఉందని, ఈ అవసరాన్ని తీర్చడానికి విమానయాన సంస్థలు మరింతగా సేవలను విస్తరింపజేస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం న్యూఢిల్లీలో ఈ రోజు సమావేశమైంది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (REMP) కోసం 7,280 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే దిశగా REMP పథకాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. అదే విధంగా పూణే నగరంలో మెట్రో రైలు పొడిగింపునకు 9,858 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా వివరించారు. దేవభూమి ద్వారక - కర్నాలస్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. దీని కోసం 1,457 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

==================

పాడి పరిశ్రమ దేశానికి మూలస్తంభమని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన జాతీయ పాల దినోత్సవం-2025 వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశం ప్రపంచంలోనే అత్యధికంగా పాలను ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. శ్వేత విప్లవం రైతులను మధ్యవర్తుల బారి నుండి విముక్తి చేసి వారి పనికి తగిన గౌరవాన్ని ఇచ్చిందన్నారు. శ్వేత విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్ చేసిన ప్రశంసనీయమైన సేవను కేంద్రమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

==================

రాజ్యాంగం భారతదేశం ఆత్మ అని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీలో ఈరోజు జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల సందర్భంగా కాఫీ టేబుల్ పుస్తకాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్ వైపు నడిపించే ప్రయాణం సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ సూత్రాల నుండి ప్రేరణ పొందిందని చెప్పారు. ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. అదే విధంగా దేశంలో 25 కోట్లకు పైగా ప్రజలను దారిద్ర్యరేఖ నుండి బయటకు తీసుకురావడం ఇటీవల సాధించిన విజయంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా, ముఖ్యమంత్రి రేఖ గుప్తా హాజరయ్యారు.

==================

ఆధార్ డేటా బేస్ లో ఖచ్చితత్వాన్ని పాటించే క్రమంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDAI) దేశ వ్యాప్తంగా 2 కోట్లకు పైగా మరణించిన వ్యక్తుల ఆధార్ నంబర్లను తొలగించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు

రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి ఈ సమాచారాన్ని సంస్థ సేకరించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటిదాకా ఒకరికి కేటాయించిన ఆధార్ నంబర్ ను మరొకరికి కేటాయించడం జరగలేదని పేర్కొంది. ఒక వ్యక్త మరణించినట్లైతే ఆ వ్యక్తి ఆధార్ నంబర్ ను తొలగించడం ద్వారా వ్యక్తి గుర్తింపును దుర్వినియోగం చేసి మోసాలకు పాల్పడి సంక్షేమ పథకాల లబ్దిని పొందకుండా చేయవచ్చని తెలిపింది. కుటుంబంలో ఎవరైనా మరణిస్తే సంబంధిత వ్యక్తి అధికార మరణ ధృవీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులు మై ఆధార్ పోర్టల్ ద్వారా పొందుపరచాలని విజ్ఞప్తి చేసింది.

==================

2030లో జరిగే శతాబ్ది కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వబోతోంది. 2010లో కామన్వెల్త్ క్రీడల తర్వాత భారతదేశం ఈ కార్యక్రమాన్ని మరో సారి నిర్వహించనుంది. గ్లాస్గోలో జరిగిన జనరల్ అసెంబ్లీలో 74 కామన్వెల్త్ దేశాల ప్రతినిధులు ఈ నిర్ణయాన్ని ఆమోదించారు. 2030 శతాబ్ది కామన్వెల్త్ క్రీడలలో 15 నుండి 17 క్రీడలు ఉంటాయని, పూర్తి కార్యక్రమాన్ని వచ్చే ఏడాది ఖరారు చేస్తామని కామన్వెల్త్ స్పోర్ట్ తెలిపింది.

==================

జాతి నిర్మాణంలో ముఖ్యమైన స్తంభంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) నిలుస్తుందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది సమ్మేళన్ ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... దేశ ప్రజాస్వామ్య పరిపాలనా పరిణామంలో UPSC 100 సంవత్సరాల ప్రయాణం కీలక అధ్యాయంగా ఉందని ప్రశంసించారు. లక్షలాది మంది యువ భారతీయులను ప్రజా సేవకు అంకితం అయ్యేలా ఈ సంస్థ ప్రేరేపించిందని అన్నారు.

==================

పంజాబ్, అస్సాం, మేఘాలయ, హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో రానున్న 24 గంటల్లో పొగమంచు కమ్ముకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అండమాన్, నికోబార్ దీవులలో ఉరుములతో కూడిన భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆ శాఖ పేర్కొంది. కేరళ, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్లోని కొన్ని ప్రాంతాలలో కూడా ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

==================

గౌహవాటి వేదికగా జరిగిన రెండో టెస్టు క్రికెట్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 140 పరుగులకు ఆలౌటైంది.

==================
==================